క్లుప్తంగా

మట్టి తవ్వకాలు ఆపాలంటూ నిరసన ర్యాలీ



పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న జి.రాగంపేట గ్రామస్తులు

పెద్దాపురం: మండలంలోని జి రాగంపేటలో జోరుగా సాగుతున్న మట్టి తవ్వకాలను ఆపాలంటూ మంగళవారం పెద్దాపురంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. జి.రాగంపేట గ్రామానికి చెందిన మనం-మన ఊరు, అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో యువత స్థానిక ఎల్ఐసీ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించి, ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుంగా శేఖర్‌బాబు, మాజీ జెడ్పీటీసీ బంగారు కృష్ణ, నానబోయిన కళ్యాణ్ కుమార్, పోతాబత్తుల నగేష్, వీరబాబు, మంగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తడి-పొడి చెత్త విడివిడిగా సేకరించాలి



సిరిపురంలో అవగాహన కల్పిస్తున్న డీఎల్పీఓ అన్నామణి

కరప: గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహించేటప్పుడు తడి, పొడి చెత్త విడివిడిగా సేకరించి, ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రానికి తరలించాలని కాకినాడ డీఎల్పీఓ టి.అన్నామణి అన్నారు. కొంగోడు, సిరిపురం గ్రామాల్లో మంగళవారం ఆమె డిప్యూటీ ఎంపీడీఓ ఎస్వీ శ్రీనివాసరావుతో కలిసి పర్యటించారు. పారిశుధ్య పనులు పరిశీలించి, గ్రామస్తులతో సమావేశమయ్యారు. పారిశుధ్య నిర్వహణ, తడి-పొడి చెత్త సేకరణ, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనితీరుపై అవగాహన కల్పించారు. నిత్యం పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని, వీధులను పరిశుభ్రంగా ఉంచాలని, డ్రైయిన్లలో పూడికలు తీయించాలని, దోమల నివారణ మందును పిచికారీ చేయించాలని ఆదేశించారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ వద్ద సెకండ్ లెవెల్‌లో తడి-పొడి చెత్తను విడదీసి, వర్మీ కంపోస్ట్ తయారీ తదితర అంశాలపై పంచాయతీ సిబ్బందికి, కార్యదర్శులకు అవగాహన కల్పించారు. గ్రామంలో బయట ఎక్కడా చెత్త వేయవద్దని, పంచాయతీ సిబ్బంది ప్రతి ఇంటికీ వస్తారని గ్రామస్తులను కోరారు. సర్పంచ్‌లు నక్కా బాబులు, నున్న సుజాత, పంచాయతీ కార్యదర్శి పి.వీరభద్రరావు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలి



నడకుదురు స్కూల్లో చిన్నారులతో ఆర్‌జేడీ నాగమణి, ఉపాధ్యాయులు

కరప: తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల్లో చదివించి ఆర్థిక ఇబ్బందులు పడేకంటే, అన్ని మౌలిక వసతులు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని విద్యా శాఖ ఆర్‌జేడీ ఆర్.నాగమణి కోరారు. ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ఉచిత విద్య అందిస్తారన్నారు. నడకదురు మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను మంగళవారం ఆమె సందర్శించారు. తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బొమ్మలతో, ఆటపాటలతో విద్యార్థులకు సమ్మర్ క్యాంప్‌ను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. ఈ క్యాంప్ మిగిలిన పాఠశాలలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెరుగుతుందని చెప్పారు. సమ్మర్ క్యాంప్‌లో పిల్లలకు బోధిస్తున్న అంశాలను హెచ్‌ఎం వాకాడ వెంకటరమణ వివరించారు. రాష్ట్ర అవార్డు గ్రహీత పిల్లి గోవిందరాజులు నిర్వహించిన పప్పెట్ షో విద్యార్థులు, తల్లిదండ్రులను ఆకట్టుకుంది. ఎంఈఓ పి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు కె.విజయలక్ష్మి, పి.నాగేశ్వరరావు, సీఆర్పీలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పనసపాడులో నేడు కుట్టు శిక్షణ ప్రారంభం

సామర్లకోట: పనసపాడు గ్రామ పంచాయతీ భవనంలో బుధవారం మహిళలకు కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించనున్నట్టు ఎంపీడీఓ కె హిమా మహేశ్వరి తెలిపారు. కుట్టు శిక్షణకు ఆసక్తి కలిగిన మహిళలు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని ఎంపీడీఓ మంగళవారం తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కుట్టు మెషీన్ ఉచితంగా అందజేస్తామని తెలిపారు.

నేడు అల్లూరి వర్ధంతి

బోట్‌క్లబ్: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమం బుధవారం స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లో ఉదయం 9.30కి నిర్వహిస్తున్నట్లు సీతారామరాజు కళావేదిక కార్యదర్శి పంపన దయానందబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. సంస్థ సభ్యులు పాల్గొనాలని కోరారు.

ఆటాడుకుందాం రా

- పాఠాలకు విరామం...ఆటలు ఆరంభం
- క్రీడాంశాల్లో శిక్షణ పొందుతున్న బాలబాలికలు
- వేసవి శిబిరాలకు పోటెత్తుతున్న విద్యార్థులు
- వివిధ రకాల క్రీడల్లో కోచ్‌ల పర్యవేక్షణతో తర్ఫీదు



ఆర్చరీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



కరాటేలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

పిఠాపురం: పది రోజుల క్రితం వరకు పుస్తకాలు, పాఠాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు చదువులకు విరామం ప్రకటించి ఆటలకు ఉపక్రమించారు. వేసవి సెలవులు ప్రారంభం కావడంతో పది రోజుల నుంచి నుంచి విద్యార్థులు పాఠశాలలకు తాత్కాలికంగా విరామం ఇచ్చి ఆటపాటలతో ఆనందంగా గడుపుతున్నారు. విద్యా సంవత్సరం ముగిసి పాఠశాలలకు వేసవి సెలవులు ఇవ్వడంతో పాఠశాలలు మూతపడగా విద్యార్థులు సెలవుల్లో ఆనందంగా గడపడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఎక్కడ చూసినా విద్యార్థులు ఆటపాటలతో ఉల్లాసంగా ఉత్సాహంగా కనిపిస్తున్నారు. మండుతున్న ఎండను సైతం లెక్క చేయకుండా ఖాళీ స్థలం కనపడితే చాలు అక్కడికి చేరి ఆటల్లో మునిగితేలుతున్నారు.

వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు ప్రారంభం

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు విద్యార్థులు పోటెత్తుతున్నారు. ఇప్పటికే పలు చోట్ల వేసవి శిబిరాలు ఏర్పాటు చేసారు. పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాల్లో వివిధ క్రీడల్లో విద్యార్థులు తర్ఫీదు పొందుతున్నారు. కరాటే, ఆర్చరీ, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, తైక్వాండో తదితర ఆటల్లో పలువురు విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో శిబిరాల వద్ద క్రీడల్లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వివిధ చోట్ల ఏర్పాటు చేసిన క్రీడా శిక్షణ శిబిరాల్లో వాలీబాల్, క్రికెట్, కబడ్డీ తదితర క్రీడాంశాల్లో విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. వేసవి సెలవులను తమ భవిష్యత్తుకు బంగారు బాట వేసే దిశగా విద్యార్థులు క్రీడా శిక్షణ శిబిరాల వైపు అడుగులు వేస్తున్నారు.

జాతీయస్థాయి పతకాల సాధనే లక్ష్యం



కేంద్రీయ విద్యాలయంలో సీటు సాధించి 1వ తరగతి నుంచి ఆర్చరీలో ఇప్పటికే శిక్షణ పొందాను. జిల్లాస్థాయిలో స్వర్ణ పతకం సాధించి రాష్ట్ర స్థాయి పోటీల్లో విశేష ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక య్యాను. జాతీయ స్థాయిలో మన రాష్ట్రానికి పతకాలు సాధించడమే లక్ష్యంగా శిక్షణ పొందుతున్నాను. దీనికి వేసవి సెలవులను వినియోగించుకుంటున్నాను.

– బి.అశ్విన్, ఆర్చరీ క్రీడాకారుడు, పిఠాపురం

క్రీడల్లో రాణించి ఉద్యోగం సాధిస్తా



నేను ఇంటర్ చదువుకుంటున్నాను. వేసవిలో ఖాళీగా ఉండకుండా పిఠాపురంలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని వినియోగించుకుంటున్నాను. ఇప్పటికే బాక్సింగ్‌లో శిక్షణ పొందాను. జిల్లా స్థాయి పోటీల్లో రెండు స్వర్ణాలు, రాష్ట్రస్థాయి పోటీల్లో కాంస్యం, రజతం సాధించాను. జాతీయస్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని తద్వారా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే ధ్యేయంతో శిక్షణ పొందుతున్నాను.

జి.సూర్యదీపిక, బాక్సింగ్ క్రీడాకారిణి, పిఠాపురం

చాలా ఆనందంగా ఉంది



నేను 4వ తరగతి చదువుకుంటున్నాను. గతంలో వేసవి సెలవుల్లో ఏదో ఒక ఊరు వెళ్లే వాళ్లం. ఇప్పుడు నాకు ఇష్టమైన ఆటలో శిక్షణ పొందడం చాలా ఆనందంగా ఉంది. తైక్వాండో చిన్నప్పటి నుంచి చాలా ఇష్టం. అందుకే దానిలో శిక్షణ పొందుతున్నాను. ఉచితంగా మా ఊళ్లోనే శిక్షణ ఇవ్వడం మాకు చాలా ఉపయోగంగా ఉంది. విద్యార్థులు ఆటల్లో తమ ప్రతిభను మెరుగుపర్చుకోవడానికి ఈ శిక్షణ శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

– అద్దంకి వంశీకృష్ణ, తైక్వాండో క్రీడాకారుడు, పిఠాపురం

క్రీడాశిక్షణ శిబిరాలకు మంచి స్పందన



వేసవి సెలవుల్లో పిఠాపురంలో నిర్వహిస్తున్న క్రీడా శిక్షణ శిబిరాలకు మంచి స్పందన ఉంది. సుమారు 100 మంది వరకు విద్యార్థులు వివిధ క్రీడల్లో శిక్షణ పొందుతున్నారు. ఇప్పటికే చాలా మంది విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబర్చి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. వీరితో పాటు కొత్త వారిని ప్రోత్సాహించి తగిన క్రీడలో శిక్షణనిస్తున్నాం.

– పి లక్ష్మణరావు, కోచ్, పిఠాపురం

పది ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న డీవైఈఓ వెంకటేశ్వరరావు

సామర్లకోట: పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని విద్యార్థులు రివిజన్ తరగతులకు హాజరయ్యే విధంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ విద్యాశాఖాధికారి నాయుడు వెంకటేశ్వరరావు సూచించారు. మంగళవారం పట్టణ పరిధిలోని యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్, ప్రభుత్వ హైస్కూల్, జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న రిజిజన్ క్లాసులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్లో ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులకు ప్రతి రోజు ఉదయం 8 నుంచి 11.45 వరకు తరగతులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వై శివరామకృష్ణయ్య, హెచ్‌ఎంలు యు సత్యనారాయణ, యు మీనామాధురి, ప్రసూన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో బీసీలకు అన్యాయం

అయ్యరక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆవాల



సామర్లకోట వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

సామర్లకోట: బీసీలకు చంద్రబాబునాయుడు తీరని ద్రోహం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ అయ్యరక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ అన్నారు. స్థాని వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. బీసీ కార్పొరేషన్ నిధులు స్వాహా చేస్తూ బీసీలను ఉద్ధరిస్తామంటూ కూటమి నేతలు ప్రకటనలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీసీలపై కపట ప్రేమ నటిస్తూ వారి ఓట్లతో అధికారాన్ని దక్కించుకున్న చంద్రబాబు సర్కార్ కుంభ కోణాలకు పాల్పడటం ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. బీసీలకు 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తామని హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో ఇచ్చిన లక్షలాది పింఛన్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం మహిళలకు కుట్టు మిషన్లు, శిక్షణ పేరుతో రూ.167 కోట్లు స్వాహా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇదే తరహాలో కమ్మ, కాపు, ఆర్యవైశ్య, క్షత్రియ కార్పొరేషన్లు కలిపి మరో 50వేల కుట్టు మెషీన్ల టెండర్లు సిద్ధం చేస్తున్నారని చెప్పారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా అమరావతి రాజధాని పేరిట చంద్రబాబు సరికొత్త డ్రామాలకు సిద్ధమయ్యారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రజలకు అండగా ఉంటుందని ఆయన అన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి చూపించారని అన్నారు. కుట్టు శిక్షణపై పూర్తి స్థాయిలో విచారణ చేసి ప్రజాధనానికి రక్షణ కల్పించాలని కలెక్టరుకు వినతి పత్రాలు అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్లు నెక్కంటి సాయిప్రసాద్, ఊబా జాన్‌మోజెస్, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, కౌన్సిలర్లు రెడ్డి లోవకుమారి, పాలిక కుసుమ, పాగా సురేష్‌కుమార్, పార్టీ నాయకులు రెడ్నం దొరబాబు, వేగి సత్యనారాయణ, కానుబోయిన విజయకృష్ణ, పెండ్యాల అబ్బు, చిట్టుమాని శ్రీనివాసరావు, రెడ్డి శ్రీనివాసు, బొందలపు వెంకటరమణ, బండారు వీరబాబు, జాగు వీరభద్రరావు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ భవనం పరిశీలన



తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే రాజప్ప తదితరులు

సామర్లకోట: స్థానిక బలుసులపేట అల్లూరి సీతారామరాజు పార్కు వద్ద ఉన్న భవనంలో తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. మంగళవారం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆ భవనాన్ని అధికారులతో కలసి పరిశీలించారు. పిఠాపురం రోడ్డులో ఉన్న భవనం ఇరుకుగా ఉందని స్థానిక ఎంపీడీఓ పాత కార్యాలయంలోకి 2016లో మార్పు చేశారు. అయితే ఆ భవనం శిథిలస్థితికి చేరుకోవడంతో పాటు వర్షపు నీరు శ్లాబ్ నుంచి లీకవుతోంది. దీంతో కార్యాలయ రికార్డులు తడిసిపోతున్నాయి. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో బలుసులపేటలో నిరుపయోగంగా ఉన్న ఐసీడీఎస్ భవనంలోకి తహసీల్దార్ కార్యాలయాన్ని మార్చుకోవాలని ఆయన సూచించారు. ఐసీడీఎస్ భవనం మరమ్మతులకు కలెక్టరు నిధులు మంజూరు చేయడంతో తహసీల్దార్ కార్యాలయం సిద్ధమైంది. ఈ భవనాన్ని ఎమ్మెల్యే పరిశీలించి ఈనెల 13న రెవెన్యూ శాఖ మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయిస్తామని తెలిపారు. ఐసీడీఎస్ కార్యాలయం సమీపంలో నిరుపయోగంగా ఉన్న మరో ఐసీడీఎస్ రూరల్ కార్యాలయాన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఇవ్వాలని ఎమ్మెల్యే నిర్ణయించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇప్పటికే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పాత తహసీల్దార్ కార్యాలయంలోకి మార్పు చేయాలని నిర్ణయించినా ఆ భవనం అనువుగా ఉండదనే ఫిర్యాదులు వచ్చాయి. దీంతో నూతన తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఖాళీగా ఉన్న భవనంలోకి మార్పు చేయడానికి అంగీకరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎ శ్రీవిద్య, డీఈ కె శశిధర్, ఎఈ ఎం రమేష్,మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ యార్లగడ్డ చిన్ని, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ కంటే బాబు తదితరులు పాల్గొన్నారు.

త్రివిధ దళాలకు విజయం కోరుతూ పూజలు



ప్రత్యేక అలంకరణలో అపర్ణాదేవి అమ్మవారు

పిఠాపురం: భారతదేశ త్రివిధ దళాలకు రక్షణ కలగాలని, విజయం చేకూరాలని కోరుతూ గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసియున్న అపర్ణాదేవి అమ్మవారికి మంగళవారం అర్జునకృత శ్రీదుర్గా స్తోత్రంతో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆకొండి ప్రభాకరశాస్త్రి ఆధ్వర్యంలో సరిహద్దులో విధుల్లో ఉన్న దేశ త్రివిధ దళాలకు విజయం చేకూరాలని, వారికి ఎటువంటి ప్రాణహాని జరగకుండా క్షేమంగా ఉండాలని ప్రార్థిస్తూ అపర్ణ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆకొండి ప్రభాకరశాస్త్రి మాట్లాడుతూ ఈ అర్జునకృత శ్రీదుర్గా స్తోత్రాన్ని 9సార్లు చదివి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించామన్నారు. అర్జునకృత శ్రీదుర్గా స్తోత్రం ఇది మహాభారత యుద్ధ సమయంలో విజయానికి దుర్గాదేవిని ప్రార్థించమని శ్రీకృష్ణుడు అర్జునుడికి ఉపదేశించినట్టు పురాణాలు చెబుతున్నాయన్నారు. ఇప్పుడు మన దేశం పాకిస్తాన్‌తో యుద్ధానికి సన్నద్ధమవడంతో కంచి మహాస్వామి సందేశం ప్రకారం దుర్గా స్తోత్రంతో పూజలు చేశామన్నారు. మన దేశానికి విజయం చేకూరాలని అందరూ ఈస్తోత్రం పఠించాలన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల ఆదాయాన్ని పెంచేందుకు కృషి



చేనేత కార్మికులతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

కొత్తపల్లి: చేనేత కార్మికుల ఆదాయాన్ని మరింత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాజెక్టును తీసుకువచ్చిందని పంచాయితీ రాజ్ రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ రాష్ట్ర సమన్వయ కర్త వినోద్‌కుమార్ అన్నారు. చేనేత కార్మికుల అభ్యున్నతికి అవసరమైన పనిముట్లు, యంత్ర సామగ్రిపై మంగళవారం ఉప్పాడలోని వీవర్స్ కాలనీలో పర్యటించి చేనేత కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చేనేత మగ్గాలను పరిశీలించారు. అనంతరం చేనేత కార్మికులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేతకు సంబంధించి పవర్‌లూమ్ పరికరాలు మరింత అభివృద్ధి చేసేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సుమారు రూ.5 కోట్లతో ప్రత్యేక పథకం ద్వారా చేనేత సొసైటీల్లో కార్మికుల ఆదాయం పెంచే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. తయారు చేసే ఉత్పత్తుల నాణ్యతను పెంచి కార్మికులు అధిక ఆదాయం పొందేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై ప్రతీ వారం కమిషనర్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రస్తుతం కార్మికులకు అవసరమైన పరికరాలు, ఆదాయం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవికుమార్, మండల విస్తరణాధికారి హరికృష్ణారెడ్డి, కార్యదర్శులు శ్రీనివాస్, సత్యన్నారాయణ పాల్గొన్నారు.

రామారావుపేట యూపీహెచ్‌సీకి అరుదైన గౌరవం

కాకినాడ క్రైం: నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్స్ (ఎన్‌క్యూఏఎస్) తనిఖీలలో స్థానిక రామారావుపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్(యూపీహెచ్‌సీ)కి రాష్ట్రంలో తొలి స్థానం దక్కింది. రోగులకు ఉత్తమ వైద్య సేవలందించడం, ల్యాబ్, ఎన్‌సీడీ, అవుట్‌రీచ్, ఫ్యామిలీ ప్లానింగ్, న్యూ బార్న్-చైల్డ్ హెల్త్, జనరల్ అడ్మిన్, మెటర్నిటీ హెల్త్, డ్రెస్సింగ్ రూం అండ్ ఎమర్జెన్సీ వంటి 12 కీలకాంశాల ప్రాతిపదికన రామారావుపేట యూపీహెచ్‌సీకి ఈ అరుదైన గౌరవం లభించింది. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఐదో తేదీ వరకు జరిగిన తనిఖీల్లో శ్రీకాకుళానికి చెందిన పెంట, బొట్టదాసింగి ఎస్‌హెచ్‌సీలకు రెండు, మూడు స్థానాలు దక్కగా, రామారావుపేట యూపీహెచ్‌సీ 93.21 శాతం మార్కులతో తొలి స్థానంలో నిలిచింది. అరుదైన గౌరవంతో ఈ ఆరోగ్య కేంద్రానికి క్వాలిటీ సర్టిఫికేషన్ లభించింది. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.జ్యోత్స్న శ్రీమౌనిక, సిబ్బందిని డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ మంగళవారం అభినందించారు.

నేటి నుంచి కాంట్రాక్టు ఉద్యోగుల సమ్మె



సమ్మె పోస్టర్లను ఆవిష్కరించిన కాంట్రాక్టు ఇంజినీరింగ్ కార్మికులు

సామర్లకోట: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు బుధవారం నుంచి సమ్మె చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మంగళవారం సాయంత్రం సమ్మె పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్ను యూనియన్ అధ్యక్షుడు వుండవిల్లి రామరాజు మాట్లాడుతూ ఆరు నెలల క్రితం కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేసినట్టు తెలిపారు. అయితే అప్పట్లో చర్చల పేరుతో తమ సమస్యలు పరిష్కరించడానికి మూడు నెలల సమయం కోరారని, అయితే ఆరు నెలలు గడిచినా సమస్యలు పరిష్కారం చేయడానికి అధికారులు చొరవ చూపలేదని అన్నారు. దీంతో సమ్మె చేయవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. 15 ఏళ్ల సీనియారిటీ ఉన్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, విధుల్లో చనిపోయిన వారికి రూ.10 లక్షలు నష్ట పరిహారంతో పాటు కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని, స్కిల్, నాన్ స్కిల్ వర్కర్లను గుర్తించి వేతనాలు ఇవ్వాలనే డిమాండ్లు పరిష్కరించలేదని తెలిపారు. లైటింగ్, వాటర్ వర్క్సులో పని చేసే కార్మికుల అత్యవసర పనులకు కొంత మేరకు మినహాయింపు ఉందని చెప్పారు.

ఎండ వేడిమికి ఉపాధి కూలీలు విలవిల



ఎండ నుంచి రక్షణగా రేకును అడ్డుపెట్టుకున్న ఉపాధి కూలీ



మండుటెండలో ఉపాధి పనులు

పిఠాపురం: వివిధ గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కూలీలు వడదెబ్బకు విలవిల్లాడుతున్నారు. కొన్ని రోజులుగా ప్రచండ భానుడి ప్రతాపం పెరిగిపోతుండడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా వేసవి కాలంలో ఉపాధి కూలీలకు నీడ కోసం టెంట్లు, మజ్జిగ, మంచినీరు, వైద్య సదుపాయాలు ప్రభుత్వం కల్పించాల్సి ఉంది. ప్రస్తుతం ఎక్కడా అటువంటి సౌకర్యాలు కల్పించలేదని ఉపాధి కూలీలు గగ్గోలు పెడతున్నారు. ఉపాధి పని సమయంలో ఎండ ఎక్కువగా ఉంటోందని, ఎటువంటి సౌకర్యాలు లేక వడదెబ్బకు గురై అనారోగ్యం పాలవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పని చేసే చోట నీడ లేక ఎండలోనే మాడిపోతున్నా అధికారులు సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదని ఉపాధి కూలీలు వాపోతున్నారు.

ఆస్తమా రోగులకు కూల్ డ్రింక్స్ హానికరం



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ అడ్డాల



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ శేషగిరిరావు

కాకినాడ రూరల్: ప్రాణాపాయమైన ఆస్తమా ఉన్న రోగులకు కూల్ డ్రింక్స్ హానికరమని డాక్టరు అడ్డాల సత్యనారాయణ అన్నారు. వీరు శీతల పానీయాలు తీసుకోరాదని, ధూమపానం, దుమ్ము, ధూళికి దూరంగా ఉండాలని సూచించారు. ప్రపంచ ఆస్తమా దినాన్ని పురస్కరించుకుని అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రమణయ్యపేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆస్తమా రోగులకు శ్వాస నాళాలు సంకోచించి, వాపు వల్ల శ్లేష్మం ఎక్కువగా తయారై, ఊపిరిని అడ్డుకుంటాయన్నారు. సాధారణ వాతావరణంతో వచ్చే ఎలర్జీ కారణంగా పిల్లల్లో జలుబు, వైరస్ వ్యాధులు ప్రబలి ఆస్తమాకు కారణమవుతున్నాయన్నారు. శ్వాస నాళాల వ్యాకోచాన్ని కలిగించే మందుల వినియోగం వల్ల వ్యాధిగ్రస్తులు ఉపశమనం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, కుమార్ యాదవ్, రవిశంకర్ పట్నాయక్, రాజా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

బోట్‌క్లబ్: శ్వాస మార్గాలు సంకోచించడం వల్ల ఆస్తమా వస్తుందని ప్రముఖ శ్వాసకోశ వ్యాధుల వైద్య నిపుణుడు డి.శేషగిరిరావు అన్నారు. ప్రపంచ ఆస్తమా దినం సందర్భంగా ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక భానుగుడి సెంటర్‌లోని సాయి ఊపిరితిత్తుల ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరం, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలెర్జీకి కారణమయ్యే కొన్ని పదార్థాలు ఆస్తమాను ప్రేరేపిస్తామన్నారు. ఆస్తమా నివారణకు వాయు కాలుష్యం, చల్లని గాలి, సువాసనలకు దూరంగా ఉండాలన్నారు. సిగరెట్లు, కొవ్వొత్తులు, ధూపం, బాణసంచా నుంచి వచ్చే పొగ నుంచి రక్షణ పొందాలన్నారు. ఈ సందర్భంగా శిబిరంలో అవసరమైన వారికి మందులు, ఇన్‌హేలర్లు ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ, సభ్యులు శ్రీవల్లీ, యేరూష, చైతన్య, ప్రకాష్, శ్రీదేవి పాల్గొన్నారు.